సాక్షి నిజామాబాద్

శనివారం, 25, ఫిబ్రవరి, 2023



'రాయితీ' నామమాత్రమేనా?
దివ్యాంగులకు అరకొరగా రాయితీ రుణాలు మంజూరు చేయడంతో వారు అసంతృప్తితో ఉన్నారు.
- 8లో ▸



శిథిల భవనంలో పనిచేసేదెట్లా?
జిల్లా మలేరియా ఆస్పత్రిని శిథిలావస్థలో ఉన్న భవనంలోకి మార్చడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /19.1

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీయవచ్చు. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు తెయూ జాతీయ సదస్సుకు గవర్నర్ రాక



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో శనివారం నిర్వహించనున్న జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్, వర్సిటీ ఛాన్స్‌లర్ సౌందర రాజన్ హాజరవుతున్నట్లు వీసీ ప్రొఫెసర్ డి రవీందర్‌గుప్తా తెలిపారు. శుక్రవారం సదస్సు బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెయూ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియాస్ జీ 20 ప్రెసిడెన్సీ ఛాలెంజ్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ ఇండియా యాజ్ ది గ్లోబల్ లీడర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, ప్రధాన వక్తగా అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ జాతీయ సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి గుంత లక్ష్మణ్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. వసుదైక కుటుంబం అనే లక్ష్యంతో సదస్సు సాగుతుందన్నారు. చీఫ్ ప్యాటర్న్‌గా వీసీ రవీందర్, ప్యాటర్న్‌గా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, కో ప్యాటర్న్‌గా ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి వ్యవహరిస్తారని సదస్సు డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

రాయ్‌పూర్ ప్లీనరీకి జిల్లా కాంగ్రెస్ నేతలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగుతున్న పార్టీ 85వ ప్లీనరీకి జిల్లా నుంచి ముఖ్య నాయకులు తరలివెళ్లారు. ఈనెల 26వ తేదీ వరకు ఈ ప్లీనరీ జరుగనుంది. తరలివెళ్లిన వారిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, రాష్ట్ర నాయకుడు బాడ్సి శేఖర్‌గౌడ్, కిక్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

బస్వాపై ఎంపీ అర్వింద్ ఫైర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యపై ఫైర్ అయ్యారు. ఈ విషయం జిల్లా పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా చర్చనీయాంశమైంది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల వారీగా కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఓ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ఓ నియోజకవర్గ ఇన్‌చార్జిని వేదిక మీద నుంచి దిగిపోవాలని ఒత్తిడి చేసినట్లు ఎంపీకి పలువురు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఫ్లెక్సీల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఫొటోలు అవసరం లేదని జిల్లా అధ్యక్షుడు చెప్పడమేమిటని పలువురు కార్యకర్తలు ఎంపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కార్నర్ మీటింగ్‌ల నిర్వహణకు సంబంధించి ఎంపీ అర్వింద్ శుక్రవారం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్న నాయకులు, కార్యకర్తలను ఫొటోలు పెట్టుకోవద్దని, వేదిక పంచుకోవద్దంటూ అడ్డుకోవడమేమిటని జిల్లా అధ్యక్షుడిపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేయడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

పసుపు @ రూ. 6,868

- మార్కెట్ యార్డులో శుక్రవారం పసుపునకు పలికిన ధర

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పసుపు పంటకు మంచి ధర లభించింది. మొన్నటి వరకు రూ.6,500 మధ్యలో అమ్మకాలు జరుగగా, ప్రస్తుతం రూ.7వేలకు చేరువలో ఉంది. మోర్తాడ్ మండలం దోంచందకు చెందిన కె.హరీశ్ రెడ్డి అనే రైతు మార్కెట్‌కు 25 క్వింటాళ్ల పసుపు తేగా, క్వింటాలుకు రూ.6,868 ధర లభించింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అదే అత్యధిక ధర అని రైతులు, మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే దాదాపు వంద క్వింటాళ్ల పసుపు రూ.6,800 ధరకు అమ్ముడుపోయింది. మోడల్ ధర రూ.5,500 లభించింది. కమీషన్ ఏజెంట్లు గురువారం మార్కెట్ బంద్‌కు పిలుపునివ్వడంతో శుక్రవారం భారీగా పసుపు అమ్మకాలు జరిగాయి. 30 వేలకు పైగా బస్తాలు వ్యాపారులు కొనుగోలు చేశారు.

ప్రజాప్రతినిధికే బురిడీ..!





భూ దందాలో అక్రమార్కుల లీలలు అంతాఇంతా కాదు.. వారసుడు లేని భూమిని నకిలీ పట్టాలు సృష్టించి నియోజకవర్గ స్థాయి అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధికే అమ్మేశారు. అదే విధంగా నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ కుమారుడి నేతృత్వంలో నాగారంలో వెలిసిన వెంచర్‌లో భూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. మరోచోట ఒకే ప్లాట్‌కు డబుల్ విక్రయాలు జరిపారు. దీంతో ఘర్షణలు జరిగి కేసులు నమోదయ్యాయి.

- వెయ్యి గజాల భూమిని దర్జాగా అమ్మేసిన ఘనులు
- నకిలీ పట్టాల వ్యవహారంపై సీపీ సీరియస్
- టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఫోర్జరీ నిందితులు
- కార్పొరేటర్ కుమారుడు, ఓ విలేకరి హస్తంపై ఆరా..!
- నగరంలో సుమారుగా రూ. 20 కోట్ల భూములకు ఎసరు..?

ఖలీల్‌వాడి : నగరంలో తవ్వినకొద్దీ భూఅక్రమాలు బయటికొస్తున్నాయి. దర్జాగా నగరంలోని ప్రజాప్రతినిధినే బురిడీ కొట్టించి వారసుల్లేని జాగాను ఆయనకు అమ్మేసిన వారు కొందరైతే.. మరోవైపు ప్రజాప్రతినిధుల అనుచరులు, ఓ ప్రధాన పత్రిక విలేకరి, నకిలీ పట్టాలు తయారు చేసే ముఠా సభ్యులంతా కలిసి అడ్డగోలుగా భూఆక్రమణలు చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. ముఖ్యంగా ఇద్దరు బీఆర్ఎస్ నేతలు నగరంలో భూదందా చేస్తూ దర్జాగా సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారు. పెద్ద మొత్తంలో జాగాలు కొనాలన్నా అమ్మాలన్నా సదరు ప్రజాప్రతినిధి అనుచరుల ప్రమేయం లేకుండా జరిగితే అంతే సంగతి. దుబ్బ ప్రాంతంలో ఓ మహిళను చీటింగ్ చేసి ఓ స్థలాన్ని అంటగట్టడానికి డబ్బులు తీసుకున్నారు. ఈ విషయమై సదరు మహిళ కోర్టుకెక్కగా ఆ ప్రజాప్రతినిధి అనుచరుడిపై కేసు నమోదు చేయాలని కోర్టు తీర్పివ్వగా పోలీసులు సదరు అనుచరుడిపై కేసు నమోదు చేశారు. ఓ ప్రధాన పత్రిక విలేకరితో పాటు ఓ పత్రిక పేరు చెప్పుకుంటూ విలేకరిగా చలామణి అవుతున్న వ్యక్తి భూదందా, ఫేక్ డాక్యుమెంట్లు, కబ్జాలు చేయడంలో ఆరితేరారు. ఓ ప్రజాప్రతినిధికి వారసుల్లేని భూమిని అంటకట్టిన వివాదంలో కొందరిపేర్లు చేర్చకుండా ఉండేందుకు పోలీసులపై ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి తెస్తున్నారని నగరంలో ప్రచారంలో ఉంది.

హైదరాబాద్ కేంద్రంగా..
నకిలీ సర్టిఫికెట్లను హైదరాబాద్ కేంద్రంగా తయారు చేసి జిల్లాలో భూకబ్జాలు సాగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నగరంలో కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని తెలిసినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, నకిలీ పట్టా తయారీ ముఠా సభ్యులు ఒక్కటై ఈ ప్రాంతంలో ఉన్న భూములపై కన్నేశారు. ఇక్కడ భూముల రేట్లు రూ.కోట్లల్లో ఉన్నాయి.

నకిలీ పట్టాలు సృష్టించి..
అర్బన్‌కు చెందిన నకిలీ పట్టాలు తయారుచేసే ఓ ముఠా కన్ను కొత్త కలెక్టరేట్ సమీపంలో త్రిభుజం ఆకారంలో వారసుల్లేని వెయ్యి గజాలస్థలంపై పడింది. దీంతో పక్కా ప్లాన్‌తో ఈ భూమికి రూ. 2 లక్షలతో నకిలీ పట్టాలు సృష్టించి ఓ వ్యక్తికి రూ.30 లక్షలకు అమ్మేశారు. అనంతరం అదే భూమిని రూ. 40 లక్షలకు తిరిగి వారే కొనుగోలు చేసి ఇదే జాగాను రూ.70 లక్షలకు ఓ ప్రజాప్రతినిధికి అంటకట్టారు. ఆ తర్వాత ఇదే భూమికి భారీగా ధర వస్తుండడంతో అదే ప్రజాప్రతినిధితో బేరసారాలు చేసి రూ. 1.50 కోట్లకు వారే కొనుగోలు చేసేందుకు డీల్ కుదుర్చుకున్నారు. ఈ డీల్‌లో ప్రజాప్రతినిధికి రూ. 50 లక్షలు కూడా చెల్లించి, మిగితా డబ్బుల కోసం సమయం తీసుకున్నారు. ఇంతలో ఈ నకిలీపట్టాల వ్యవహారం బయటకొచ్చింది. దీంతో సదరు ప్రజాప్రతినిధికి రూ.కోటి చెల్లింపుపై సందిగ్ధత నెలకొన్నట్లు సమాచారం. అదే ముఠా నగరంలోని సాయి నగర్‌లోని రోడ్డు నెం.1లో భూమిని ఒక వృద్ధుడి పేరుమీద పట్టా సృష్టించి బ్యాంక్ నుంచి రూ. కోటి బ్యాంక్ రుణం కూడా తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో వృద్ధుడికి ముఠా సభ్యులు రూ. 50 లక్షలు ఇచ్చి మిగితా రూ. 50 లక్షలు నొక్కేశారని తెలిసింది. ఈ వ్యవహారంలో ఓ పత్రిక విలేకరిగా చెప్పుకుంటున్న వ్యక్తి ఉన్నట్లు సమాచారం.

విచారణకు ఆదేశం..!
నకిలీ పట్టాల వ్యవహారంపై సీపీ నాగరాజు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ కేసును ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. వారం రోజులుగా పోలీసులు నకిలీ పట్టాల వ్యవహారంపై ఆరా తీయగా ఆసక్తికరమైన విషయాలు బయటికొచ్చినట్లు తెలిసింది. శుక్రవారం నకిలీ పట్టాల వ్యవహారంపై నగరానికి చెందిన ఒకరు సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. 2002లో 400 గజాల స్థలం కొనుగోలు చేయగా కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశారని సమాచారం.

వెంచర్ వేసి.. మాయ చేసి..
నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ కుమారుడు, మైనారిటీ నేత, ఓ ప్రధాన పత్రిక విలేకరి డిచ్‌పల్లి, నాగారంలో వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్‌లో కూడా అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. సదరు రిపోర్టర్ దుబ్బ ప్రాంతంలో వారసుల్లేని భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో ఉన్న ఓ కాలువ కూడా ఆనవాళ్లు లేకుండా చేశారని సమాచారం. సదరు రిపోర్టర్ వ్యవహారంపై పోలీసులు కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కొత్త కలెక్టరేట్ పరిసర ప్రాంతంలో సదరు విలేకరి ఓ ఫాంహౌజ్ కూడా నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. గతంలో నిజామాబాద్ ఆర్డీవో ఆఫీస్‌లో పనిచేసే సిబ్బంది, సర్వేయర్‌తో ఈ రిపోర్టర్ సత్సంబంధాలు నడిపి నకిలీ పట్టాలు, ఫోర్జరీ వ్యవహారాలు చక్కబెట్టినట్లు ఆరోపణలున్నాయి. వినాయక్‌నగర్‌లో ఇంటి విక్రయానికి సంబంధించిన వ్యవహారంలో తలదూర్చగా ప్రస్తుతం వివాదంలో ఉంది.

పోలీసుల అదుపులో కొందరు?
నగరంలోని ఆయా ప్రధాన ప్రాంతాల్లో వారసుల్లేని..అసైన్డ్ భూములపై కన్నేసిన ఈ నకిలీ పట్టా ముఠా సభ్యులు సుమారు రూ. 20 కోట్లకు పైగా లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్లు, ఫోర్జరీ సంతకాల్లో ఆరితేరిన వ్యక్తిని రెండ్రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో కొంత మందిని తప్పించాలని, ఓ ప్రధాన పత్రిక విలేకరి కూడా కేసు నుంచి బయట పడేందుకు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

నకిలీ పట్టా కేసులో ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు
- నకిలీ పట్టాలు, స్టాంప్‌లు స్వాధీనం

ఖలీల్‌వాడి : నకిలీ పట్టా కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సీతారాంనగర్‌కు చెందిన గొడుకు శేఖర్ అనే వ్యక్తి ఇంటిస్థలం కోసం తన స్నేహితుడు గణేశ్‌ను అడగగా గణేశ్ నగరంలోని సుదర్శన్, అమర్ సింగ్‌ల వద్దకు శేఖర్‌ను ఈనెల 10న తీసుకెళ్లాడు. ఇంటి స్థలం కావాలంటే రూ. 25 ఇస్తే 60 గజాల జాగా ఇప్పిస్తానని వారు శేఖర్‌కు చెప్పగా ఈనెల 13న సుభాష్‌నగర్‌లోని జెడ్పీ వద్ద రూ. 25 వేలను సుదర్శన్, అమర్‌సింగ్‌కు అందజేశారు. అనంతరం శేఖర్ భార్య స్వప్న పేరుతో 60 గజాల పట్టాను తీసుకొచ్చి శేఖర్‌ను ఇచ్చారు. కాని ఈ పట్టాలు నకిలీవని తెలుసుకున్న శేఖర్ సదరు పట్టా ఇచ్చిన సుదర్శన్, అమర్‌సింగ్‌లను తన డబ్బులు తనకివ్వాలని కోరగా వారు ఇవ్వమంటూ బెదిరించారు. దీంతో బాధితుడు శేఖర్ మూడవ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు ఇద్దరికి అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దుబ్బలోని చాలామందికి నకిలీ పట్టాలిచ్చామని వారు విచారణలో తెలిపారన్నారు. వారి నుంచి ఫేక్ పట్టా కాగితాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన టాస్క్ ఫోర్స్ సీఐ వెంకటేష్, నగర టౌన్ సీఐ వెంకట నారాయణ, ఎస్సై శ్రావణ్ కుమార్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట



టీఎన్జీవో క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

- రాష్ట్ర క్రీడలు, ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్
- జిల్లాతో నాకు ప్రత్యేక అనుబంధం
- అత్తగారిల్లు ఇక్కడే.. అందుకే మమకారం
- అట్టహాసంగా ప్రారంభమైన టీఎన్జీవో క్రీడలు

నిజామాబాద్‌నాగారం : ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందూరు జిల్లాతో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని, మా అత్తాగారిల్లు ఇక్కడేనని ఎన్నో కార్యక్రమాలున్నా ప్రత్యేకంగా టీఎన్జీవో క్రీడల ప్రారంభోత్సవానికి వచ్చానని రాష్ట్ర క్రీడలు, ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. టీఎన్జీవో 34వ జిల్లా స్థాయి అంతర్ శాఖల క్రీడోత్సవాలను కలెక్టరేట్ సముదాయంలోని ఆవరణలో శుక్రవారం మంత్రి ప్రారంభించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకావిష్కరణ చేసి పోటీలను ప్రారంభించారు. జీతభత్యాలు, పదోన్నతులు వంటి అనేక విషయాల్లో, అంగన్వాడీలు, ఆశవర్కర్లు మొదలుకుని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వరకు ప్రతి ఉద్యోగి సాధకబాధకాలను గుర్తెరిగిన సీఎం కేసీఆర్ అందరికీ ఆమోదయోగ్యమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉద్యోగుల కృషి వల్లే రాష్ట్రానికి అవార్డులు వస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 17,670 క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి వచ్చాయని, త్వరలోనే మరో 19వేల క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పూర్తి కానుందన్నారు. అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సుమారు 20 కోట్ల విలువ చేసే 600 గజాల స్థలాన్ని అందించిందని, తొందరలోనే ఆమెకు గ్రూప్–1 హోదాతో కూడిన డీఎస్పీ ఉద్యోగం కూడా కేటాయించనుందన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన మరో క్రీడాకారిణి ఇషాసింగ్‌కు కూడా ప్రభుత్వపరంగా స్థలం అందజేశామన్నారు.

కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీ వీజీగౌడ్, మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మామిళ్ళ రాజేందర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు ఉపశమనం క్రీడలు
– రాజీవ్‌గాంధీ హనుమంతు, కలెక్టర్

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలై ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడలతో ఉపశమనం లభిస్తుందన్నారు. క్రీడలు అందించే ఉల్లాసంతో ఉద్యోగులు మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అయితే ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎర్రజొన్నకు అడ్డగోలు రేటు

- ఒక్కో గ్రామంలో ఒక్కో ధర
- రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్న వ్యాపారులు
- అన్నదాతకు తగ్గుతున్న లాభాలు

మోర్తాడ్(బాల్కొండ) : ఎర్రజొన్నల కొనుగోలు కోసం రైతులతో ధర ఒప్పందాలను కుదుర్చుకుంటున్న సీడ్ వ్యాపారులు అంతటా ఒకే ధర కాకుండా భిన్నమైన ధరలను నిర్ణయిస్తున్నారు. ఫలితంగా ఎక్కువ ధర నిర్ణయమైన చోట సంతోషం వ్యక్తమవుతుండగా, తక్కువ ధర ఒప్పందం జరిగిన గ్రామాల్లో రైతులకు లాభాలు తగ్గనున్నాయి. ఎర్రజొన్నల రైతులు నష్టపోకుండా ఉండటానికి సీడ్ వ్యాపారులతో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించిన విషయం విదితమే. ఎర్రజొన్నలకు మొదట్లో ప్రచారం జరిగిన విధంగా క్వింటాలుకు రూ.4,300 ధర కాకుండా రూ.3,700 లోపు ధర నిర్ణయం జరుగుతుంది. ఎర్రజొన్నల సాగు విస్తీర్ణం 25 శాతం తగ్గినప్పటికి ఈ పంటకు డిమాండ్ లేదని వ్యాపారులు చెబుతున్నారు. తెల్లజొన్నలకు క్వింటాలుకు రూ.3,700ల వరకు, ఎర్రజొన్నలకు రూ.3,600 వరకు ధర నిర్ణయం జరుగుతుంది.

జిల్లాలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్, బాల్కొండ, వేల్పూర్, నందిపేట్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి మండలాల్లో ఎర్రజొన్నలు, తెల్లజొన్నలను సాగుచేశారు. రూ.3,500ల నుంచి రూ.3,700ల వరకు ధర ఒప్పందాలు కొనసాగుతున్నాయి.



మోర్తాడ్‌లో కోత దశకు వచ్చిన ఎర్రజొన్నలు

ముగ్గురిని కరిచిన వీధి కుక్కలు

కుక్కను చంపేసిన గ్రామస్తులు



మధుకర్ కాలుకు కుక్క కరిచిన గాయం

సదాశివనగర్ (ఎల్లారెడ్డి)/నస్రుల్లాబాద్(బీర్కూర్) : కామారెడ్డి జిల్లాలో వీధికుక్కలు మరోసారి స్వైరవిహారం చేశారు. రెండు గ్రామాల్లో ముగ్గురిపై దాడి దాడిచేసి గాయపర్చాయి. ఓ గ్రామంలో గ్రామస్తులు వెంటపడి చంపేశారు.. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం జనగాంలో ఇద్దరు మహిళలపై దాడి చేసి గాయపరిచిన వీధికుక్కను గ్రామస్తులు శుక్రవారం చంపేశారు. మొదట గ్రామానికి చెందిన అంబీర్ సుధాబాయి పింఛన్ డబ్బుల కోసం హన్మాన్ మందిరం వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో తోటి మహిళలతో మాట్లాడుతుండగా వీధిలో నుంచి వేగంగా వచ్చిన కుక్క అమాంతంగా దాడి చేసి గాయపర్చింది. అనంతరం అదే గ్రామంలో మరో వీధిలోకి వెళ్లి గైని బాలమణి నడుచుకుంటు వెళ్తుండగా దాడి చేసి గాయపరిచింది. ఇద్దరు మహిళల కాళ్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కర్రలు పట్టుకొని వెంబడించి కుక్కను చంపేశారు. అనంతరం గ్రామ శివారులో ఖననం చేశారు. బీర్కూర్‌కు చెందిన ఆరె మధుకర్‌ను వీధి గుండా వెళ్తున్న సమయంలో వీధి కుక్క వేటాడి మరీ తీవ్రంగా గాయపరిచింది.



జనగాంలో గ్రామస్తులు చంపిన వీధికుక్క

'కంటి వెలుగు'ను ప్రత్యేకంగా పర్యవేక్షించాలి

- 'డబుల్' లబ్ధిదారుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి
- వీసీలో కలెక్టర్లతో సీఎస్ సమీక్ష

సుభాష్‌నగర్ : అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. డబుల్‌బెడ్ రూం పథకంతో పాటు కంటి వెలుగు, పోడు భూములకు పట్టాల పంపిణీ, జీవో నెం. 58, 59, 76, 118 అమలు, తెలంగాణకు హరితహారం, ఆయిల్‌పామ్ సాగు, కలెక్టరేట్లలో అన్ని శాఖలను సమన్వయం చేయడంపై మార్గనిర్దేశం చేశారు. కంటి వెలుగులో భాగంగా రాష్ట్రంలో ప్రతిరోజు రెండు లక్షలకు మందికి పైగా నేత్ర పరీక్షలు చేసి కంటి అద్దాలు అందిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలో ఇప్పటికే 400 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యిందని, మరో రెండు మూడు రోజుల్లో మిగతా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని, వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నామన్నారు. కాగా పోడు భూములకు సంబంధించి అర్హులకు పట్టాలిచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సీఎస్ ఆదేశించారు. హరితహారానికి ప్రాధాన్యతనివ్వాలని, ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని సాధించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలన అవినీతిమయం : ఎంపీ అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బీఆర్ఎస్ పాలనలో అవినీతి, గూండాయిజానికి అడ్డూఅదుపు లేకుండా పోయిందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అర్వింద్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్యేల గూండాయిజం నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరానన్నారు. ఇటీవల బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కబ్జాల పర్వం నడుస్తోందని, గంజాయి విక్రయాల్లోనూ వాటాలున్నాయన్నారు.

బోధన్‌లో ఎక్రిమోడల్, మదినాతూలుమ్ పాఠశాలల్లో రూ.కోటికిపైగా అవినీతి జరిగిందని, అవినీతిపరులకు బోధన్ ఎమ్మెల్యే అండదండలున్నాయన్నారు కలెక్టర్‌కు ఈ అవినీతిపై వినతిపత్రం అందజేశానన్నారు. సొసైటీల్లో కూడా విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతుంటే కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఆయన వెంట నాయకులు పంచరెడ్డి లింగం, బంటు రాము, ప్రదీప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి



వేల్పూర్: మండలంలోని పడగల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతావని విముక్తికోసం పోరాడిన యోధుడు ఛత్రపతి శివాజీ అన్నారు. అఖండ భారతమే ధ్యేయంగా 10 మంది సైనికులతో బయలుదేరి చరిత్ర పుటల్లో నిలిచిపోయారన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఆయన స్ఫూర్తిని సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారన్నారు. ఎంపీపీ బీమజమున, సర్పంచ్ ద్యావతి వర్షిణి, ఎంపీటీసీలు మీసాల హేమలత, గైని పాపాయి విజయ తదితరులు పాల్గొన్నారు.

చద్మల్ తండా పాఠశాల పరిశీలన



గాంధారి: మండలంలోని చద్మల్ తండా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నోటు బుక్కులను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ జిల్లా కో–ఆర్డినేటర్ వేణు శర్మ, రాష్ట్ర బృందం సభ్యులు సంజీవ కుమార్, చక్రధర్‌రావు, కిషన్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



నిజామాబాద్‌నాగారం:నగరంలో ఎక్కడైన అక్రమ నిర్మాణాలు చేపడితే ఇందుకు సహకరించిన వారిపై చర్యలు ఉంటాయని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారుల జాబితాను కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో భయం పట్టుకుంది. తనిఖీలు కొనసాగనున్నాయి.

ఖాతాలో నుంచి డబ్బులు మాయం

కామారెడ్డి క్రైం: ఖాతాదారుని ప్రమేయం లేకుండా ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.13,348 కట్ అయ్యాయి. ఈ ఘటన కామారెడ్డిలోని కలికినగర్ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన భోనగిరి రమేష్‌కు కామారెడ్డిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ నెల 9న అతని ప్రమేయం లేకుండానే రూ. 13,348 కట్ అయ్యాయి. ఇలా ఎందుకు జరిగిందని బ్యాంకు అధికారులను సంప్రదించాడు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 76 మంది గైర్హాజర్

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం జిల్లా వ్యాప్తంగా 76 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఇంటర్ విద్యాధికారి రఘురాజు తెలిపారు. డీఐఈవో రఘురాజ్ ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రాయితీ నిధులు నామమాత్రమేనా?

- దివ్యాంగుల స్వయంఉపాధి కోసం సబ్సిడీపై యూనిట్ల మంజూరు
- జిల్లాకు అరకొరగా కేటాయింపు



మోర్తాడ్(బాల్కొండ): దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక చేయూతను అందించడానికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందిస్తోంది. కానీ ప్రస్తుత సంవత్సరం జిల్లాకు అరకొరగా నిధులు మంజూరు చేయడంతో ప్రభుత్వం తీరుపై దివ్యాంగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 35మందికే..

జిల్లాలో వేల సంఖ్యలో దివ్యాంగులుంటే కేవలం 35మందికే ప్రభుత్వం రాయితీ కోసం నిధులు మంజూరు చేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2022–23ఆర్థిక సంవత్సరానికి గాను 32మందికి వందశాతం రాయితీపై రూ. 50వేల చొప్పున సహకారం అందించాలని నిర్ణయించారు. అలాగే రూ. లక్ష వరకు రుణాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేసేందుకు ఒక యూనిట్‌ను మంజూరు చేశారు. ఇందులో రూ. 20వేలు బ్యాంకు రుణం, మిగిలిన రూ. 80వేలు దివ్యాంగుల శాఖ ద్వారా రాయితీ కింద మంజూరు చేస్తారు. రూ.2లక్షల యూనిట్‌ను ఒకటి కేటాయించగా ఇందులో 70శాతం రాయితీ పోను, 30శాతం బ్యాంకు లింకేజీ రుణం అందించనున్నారు. రూ.10లక్షల వరకు ఒక యూనిట్‌ను మంజూరు చేయగా రూ.5లక్షల వరకు రాయితీ, మిగిలిన సొమ్మును బ్యాంకు రుణంగా మంజూరు చేయనుంది. మొత్తం 35 యూనిట్ల కోసం రూ.23.20లక్షలను రాయితీ కింద అందించనున్నారు.

దివ్యాంగుల సంఖ్య పెరిగిపోతున్నా..

జిల్లాలో దివ్యాంగుల సంఖ్య ఏటేటా పెరిగిపోతున్నా.. రాయితీ పథకంలో యూనిట్ల సంఖ్యను తక్కువగా మంజూరు చేయడంతో పోటీ తీవ్రమైంది. కనీసం ఏటా 500ల మందికి లబ్ధి చేకూర్చినా ఐదేళ్ల కాలంలో సగం మంది దివ్యాంగులకైనా ఆర్థిక చేయూత లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాయితీ యూనిట్ల కోసం ప్రతి మండలంలో వందల సంఖ్యలో దరఖాస్తులు అందుతుండగా ఒక్క యూనిట్‌ను ఎలా కేటాయించాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాయితీ రుణాలను తక్కువ మంజూరు చేయడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి దివ్యాంగులపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ఎక్కువ యూనిట్లకు నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది..



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రాయితీ యూనిట్లను మంజూరు చేయడంపై అలసత్వం వహిస్తుంది. అరకొరగా నిధులు కేటాయించడాన్ని పరిశీలిస్తే ప్రభుత్వానికి దివ్యాంగులపై చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుంది. ప్రభుత్వం తీరును పోరాటాల ద్వారా ఎండగడుతాం.

– సుజాత సూర్యవంశీ, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకురాలు, నిజామాబాద్

26న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష

సుభాష్‌నగర్: నగరంలో ఈ నెల 26న టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష రెండు సెషన్లలో 20 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందే చూసుకోవాలని తెలిపారు. అభ్యర్థి తన ఫొటో కాని, పేరు విషయంలో తప్పులు దొర్లితే తమ పాస్‌ఫోర్టు సైజ్ మూడు ఫొటోలపై గెజిటెడ్ అధికారి సంతకంతో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం 2.15 నిమిషాల తరువాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమని తెలిపారు. పరీక్షలపై ఏమైన సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 08462 -220183 ను సంప్రదించలని సూచించారు.

అభ్యర్థులకు బస్సులు ఏర్పాటు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష కోసం అభ్యర్థులకు బస్సులు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఉషాదేవి తెలిపారు. ఈ నెల 26(ఆదివారం) జరిగే పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల నుంచి బస్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బస్టాండ్‌లో అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, వివరాలకు 7382845921కు ఫోన్ చేయాలన్నారు. నిజామాబాద్ నగరంలో అభ్యర్థులకు లోకల్ సిటీ బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

బీజేపీతోనే కష్టాలు దూరం



మోర్తాడ్: బీజేపీ అధికారంలో ఉంటేనే ప్రజలకు కష్టాలు దూరం అవుతాయని ఎంపీ అర్వింద్ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ప్రజలకు అన్ని పథకాలు అందుతాయని చెప్పారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో నిర్వహించిన ప్రజా గోస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం ప్రజల కోసమే పని చేస్తారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ రెడ్డి, మల్కన్నగారి మోహన్‌రెడ్డి, పుప్పాల నరేష్, రాజారపు ప్రదీప్, నిమ్మల శ్రీనివాస్, తీగెల రమేష్‌రెడ్డి, గంధం చిన్నయ్య, ఏలేటి నారాయణరెడ్డి, నవీన్, సంజీవ్, మహిపాల్ పాల్గొన్నారు.

నా భర్త ప్రాణాలు కాపాడండి

- దేవునిపల్లికి చెందిన రమేష్‌కు గుండెపోటు
- హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స
- ఆపరేషన్‌కు రూ.8లక్షలు అవసరం
- ఆదుకోవాలని వేడుకుంటున్న భార్య



ఆదుకోవాలని వేడుకుంటున్న రమేశ్ భార్య, పిల్లలు



నాగళ్ల రమేష్

కామారెడ్డి టౌన్: పట్టణంలోని దేవునిపల్లికి చెందిన నాగళ్ల రమేష్ నిజాంసాగర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. పేద కుటుంబానికి చెందిన రమేష్‌కు గురువారం గుండెపోటు వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించి వెంటనే హైదరాబాద్ తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. అసలే రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ పరిస్థితి. ఆయనకు గతంలో ఓ సారి హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆస్పత్రిలో చూపెట్టుకోగా తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని లేదా మరోసారి గుండెపోటు వస్తే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు చెప్పారు. ఇప్పుడు మళ్లీ గుండెపోటు వచ్చింది. ఆస్పత్రిలో ఇప్పటికే రెండు రోజుల్లో రూ.రెండు లక్షలకు పైగా చెల్లించారు. బంధువులను, మిత్రులను అడిగి అప్పు చేసి ఆ డబ్బులను చెల్లించారు. ఆపరేషన్‌కు రూ.ఎనిమది లక్షలకు పైగా అవసరం అని వైద్యులు తెలిపారు. వారి వద్ద డబ్బులు, ఆస్తులు లేకపోవడంతో ఏం చేయాలో దీన స్థితిలో ఉన్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఆయనకు భార్య శ్యామల, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఎలాగైన తన భర్తను కాపాడాలని భార్య, తండ్రి కాపాడండంటూ పిల్లలు వేడుకుంటున్నారు. దేవునిపల్లి గ్రామస్తులు, స్నేహితులు విరాళాలు సేకరిస్తున్నారు.

సాయం అందించాల్సిన వివరాలు..

గూగుల్ పే: 9848540149
బ్యాంక్ ఖాతా నంబర్ : 911010018224463
పేరు : నాగళ్ల రమేశ్ యాక్సిస్ బ్యాంక్,కామారెడ్డి
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : UTIB0001030

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఏజీఎం శ్రీనివాసరావు

డిచ్‌పల్లి: ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా డిజిటల్ రూపంలో జరుగుతున్నాయని దీంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఏజీఎం డి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)ను ఏజీఎం శ్రీనివాసరావుతో పాటు నిజామాబాద్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఏజీఎం సాయిప్రభు సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ సీఏలకు ఎఫ్ఎల్‌సీఆర్‌పీ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణ తరగతులు, వసతి సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఏజీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇక్కడ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఈటీఐలో మరింత మెరుగైన వసతులు కల్పించడానికి తనవంతు కృషి చేస్తానని ఏజీఎం శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సెర్ప్ రిసోర్స్ పర్సన్ వెంకట్, డీపీఎం నీలిమ, ఆర్‌ఎస్ఈటీఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన తెయూ పీడీఎస్‌యూ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీలో బాలికల సంఖ్యకనుగుణంగా వసతి గృహం లేక ఒక్కో గదిలో 10–12 మంది విద్యార్థినులు ఉండాల్సి వస్తోందన్నారు. అదనపు హాస్టల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పీజీ విద్యార్థులకు ఫెలోషిప్ ఇవ్వాలని, వర్సిటీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. తెయూలో ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జన్నారపు రాజేశ్వర్, సంతోష్, జయంతి, గొని ప్రసాద్, రవీందర్, రామకృష్ణ, నరేష్, శేషు, అశ్విత్, శివసాయి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ క్రీడలు ప్రారంభం



క్రీడ జెండాను ఎగురవేస్తున్న మంత్రి





గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, క్రీడజ్యోతి వెలిగిస్తూ..

టీఎన్జీవోస్ నిజామాబాద్ జిల్లా స్థాయి అంతర్ శాఖల క్రీడలను కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడల మంత్రి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సదానందం మృతదేహం

నందిపేట్: ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన కుర్మె సదానందం(29) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెల్మల్ గ్రామంలో కొంతకాలంగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో ఓ వర్గం వారు గ్రామానికి చెందిన కుర్మె పెద్ద సాయన్న కొడుకు సదానందంను పిలిచి వీడీసీ కమిటీలో మీ నాన్న అడ్డు రాకుండా చూడాలని హెచ్చరించినట్లు సమాచారం. ఈ విషయమై తండ్రి కొడుకుల మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కొడుకు సదానందం మనస్తాపం చెంది మండలంలోని కుద్వాన్‌పూర్ శివారులోని ఎల్లమ్మగుడి ప్రాంతంలో విష గుళికలు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మాక్లూర్ తండాకు చెందిన మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని మాక్లూర్ తండాకు చెందిన బానోత్ అనూష జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. గత ఆదివారం రాత్రి అనూష తన కొడుకుతో గొడవపడి పురుగు మందును తాగింది. వెంటనే కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి అనూష మృతి చెందింది.

మహిళ అనుమానాస్పద మృతి



సవంత(ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి తండాకు చెందిన చౌహాన్ సవంత (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. గురువారం సాయంత్రం సవంత కల్లు తాగి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు పోయి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సుద్దపల్లి శివారు పెద్దమ్మ గుడి వెనకాల కాలువలో సవంత మృతదేహాన్ని గమనించిన స్థానికులు వారి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతురాలి భర్త మోహన్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు.

మద్యం సేవించి వేధించడంతో..

- భర్తను చంపిన భార్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రేమ్‌కుమార్

బోధన్‌టౌన్: మద్యం సేవించి తరుచూ వేధిస్తుండంతో నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం పాన్‌గల్లీలో బక్కోళ్ల బాలు (30)ను తలపై బండరాయితో కొట్టి భార్య గౌతమి హతమార్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాలుకు గౌతమితో 10 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. పని చేయకుండా మద్యం సేవించి బాలు రోజు వేధించే వాడని, దీంతో ఇంట్లో గొడవలు జరిగేవన్నారు. వారం రోజుల నుంచి ప్రతిరోజు మద్యం సేవించి ఇంట్లో గొడవ చేస్తూ పిల్లలను అమ్మేస్తానని భయపెట్టే వాడని తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంట్లో గౌతమితో గొడవ పడి బయటకు వెళ్లి మళ్లీ మద్యం సేవించి వచ్చి పడుకున్నాడు. తీవ్ర ఆసహనానికి గురైన గౌతమి బయట ఉన్న పెద్ద బండరాయిని తీసుకు వచ్చి తలపై బలంగా కొట్టడంతో బాలు మృతి చెందాడు. కాగా తన కోడలు గౌతమి, బాలును చంపితేనే ప్రశాంతంగా ఉంటుందని పలుమార్లు అనేదని, ఈ క్రమంలో తన కొడుకును చంపి ఉంటుందని మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నిందితురాలి ఆచూకి తెలియడం లేదన్నారు.

బంగారం కొనివ్వలేదని భార్య ఆత్మహత్య

- భర్త కిడ్నీ వ్యాధి బాధితుడు



నందిని (ఫైల్)

రామారెడ్డి: భర్త అనారోగ్యంతో బాధపడుతుంగా.. తనకు బంగారం కొనివ్వలేదని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సత్యనారాయణ కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడు తూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా బాధితుడి భార్య దార నందిని(28) మాత్రం తనకు ప్లాట్లు అమ్మి బంగారు నగలు చే యించాలని భర్తను వేధిస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి బయట సత్యనారాయణ కూర్చొని ఉండగా ఇంట్లో వెళ్లి తలుపులు వేసుకున్న నందిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ప్లాట్లు అమ్మి డబ్బులు ఇవ్వనందునే తన కుతూరు నందిని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి కుదుల నీలవ్వ ఫి ర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఎలాంటి ప్లాట్లు అమ్మలేదని, సత్యనారాయణ అనారోగ్యంతో ప్రతిరోజూ డయాలసిస్ చేయించుకుంటున్నాడని, ఈ క్రమంలో నందిని ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. తండ్రి డయాలసిస్ పెషంట్ కాగా, తల్లి హఠాన్మరణంతో ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

అదృశ్యమైన మహిళ శవమై తేలింది

ఎడపల్లి: మండలంలోని పోచారం గ్రామంలో ఇటీవల అదృశ్యమైన మహిళ శుక్రవారం అలీసాగర్ లిఫ్ట్ కాలువలో శవమై తేలింది. గ్రామానికి చెందిన గైని రత్నమ్మ(58) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని స్థానికులు తెలిపారు. ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం గ్రామ సమీపంలో గల అలీసాగర్ లిఫ్ట్ కాలువలో రత్నమ్మ మృతదేహం తేలింది. రత్నమ్మ మృతికి కారణాలు తెలియరాలేదు. రత్నమ్మకు భర్త, పిల్లలు లేరు. కేసు నమోదు చేశామని ఎస్సై పాండేరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి: పట్టణంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు ఏఎస్సై నర్సింగ్‌రావు తెలిపారు. పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హబీబ్ టీవీఎస్ ఎక్సెల్‌పై అంబేడ్కర్ చౌరస్తా వైపు వెళ్తుండగా నిజాంసాగర్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనక వైపు నుంచి ఢీకొంది. హబీబ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు చేతి విరిగింది. హబీబ్‌ను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి హైద్రాబాద్‌కు వైద్యులు రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. హబీబ్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

చోరీకి వచ్చి పారిపోతుండగా రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన వ్యక్తి, గాయపడ్డ వ్యక్తి

నందిపేట్ : చోరీ చేస్తుండగా స్థానికులు చూశారని పారిపోతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కుద్వాన్‌పూర్ శివారులో గురువారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుద్వాన్‌పూర్ గ్రామంలోని మొబైల్ దుకాణంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు దొంగతనం చేస్తుండగా గ్రామానికి చెందిన వ్యక్తులు చూశారు. వారి నుంచి తప్పించుకునేందుకు నిందితులు ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్‌పై అతివేగంగా నందిపేట వైపు పారిపోయారు. ఈ క్రమంలో కుద్వాన్‌పూర్ శివారులోని కమాన్ ప్రాంతంలో వారి వాహనం చెట్టుకు ఢీకొంది. స్థానికులు వారి వద్దకు వచ్చి చూడగా ఇద్దరు స్పృహ తప్పి పడిపోయారు. వారిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో వ్యక్తి స్పృహలో లేడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ ఘటనపై ఆరా తీయగా మొబైల్ దుకాణంలో చోరీకి పాల్పడ్డారని, వారి వద్ద రెండు ఇనుప రాడ్లు లభ్యమయ్యాయన్నారు. వారు ప్రయాణించిన టీవీఎస్ ఎక్సెల్ బండి సైతం దొంగిలించిందేనని చెప్పారు. నిందితులు ఇద్దరిలో ఒకరిది ఆదిలాబాద్ ప్రాంతంగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లిలో ఎన్నారై హలీమాబేగంకు చెందిన భూమిని అక్రమంగా తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మాలపల్లికి చెందిన హలీమాబేగం అమెరికాలో ఉంటుంది. ఈమెకు మాలపల్లిలో ఏడో నెంబర్ ప్లాట్ ఉంది. ఈమె విదేశాల్లో ఉన్న విషయం గమనించి మహ్మద్ అబ్దుల్ ముఖీద్, ముజాజుద్దీన్ సిద్దీఖీ, అహ్మద్‌నబీ(డ్యాకుమెంటరీ రైటర్), ఇమ్రాన్(ఆన్‌లైన్ సెంటర్) తోపాటు రైసాహూస్సేనీ అనే ఐదుగురు నకిలీ ఆధార్‌కార్డు సృష్టించి 2022న ఇంటిస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఇటీవల అమెరికా నుంచి వచ్చిన హలీమాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఇప్పటికే ముగ్గురిని అదుపులో తీసుకోగా, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌ను తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER
Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283. [H-793615]

REAL ESTATE

HOUSE FOR SALE
HOUSE FOR SALE: Bhagyanagar Colony, Near new Collector office, East facing, 112 gaz, Price 35 Lakhs. Cell: 9603843319 [K- 1232769]

FOR SALE
1100sq Yards Prime Commercial Land For Sale in Weekly Bazar, NZB. Suitable For Hospital, Educational Institution Etc. 9391042031. [WB-55289]

WANTED
ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.